జిల్లా అదనపు కలెక్టర్‌గా నగేష్ బాధ్యతలు స్వీకరణ

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసిన అదనపు కలెక్టర్ నగేష్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 29 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ సలహాలు, సూచనలు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడానికి కృషిచేస్తానని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులైన మెంచు నగేష్ మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం నగేష్ మాట్లాడుతూ జిల్లాలో సమర్థవంతమైన పాలనలో కలెక్టర్ సూచనలు, సలహాలు పాటిస్తూ వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు విశేష కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నర్సాపూర్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన మహిపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. అదనపు కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన నగేష్‌కు కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పూల బొకేలు, శాలువాలతో శుభాకాంక్షలు తెలిపారు.

ఎఐటియుసి ఆవిర్భావ దినోత్స వేడుకలను విజయవంతం చేద్దాం

జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 29, ప్రభాతవార్త : ఏఐటియూసి 105వ ఆవిర్భావ దినోత్స వేడుకలను విజయవంతం చేద్దామని జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎల్ల గురువారెడ్డి భవనంలో మంగళవారం నిర్వహించిన ఏఐటియూసి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల కష్టాలకు అండగా నిలవడానికి 1920 ముంబాయి నగర నడి సముద్రంలో సమావేశంమై ఏఐటియూసిగా నామకరణం చేసి 105 ఏళ్లు పూర్తిచేసుకున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటియూసి అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ఏఐటియూసి పోరాడి సాధించిన కార్మిక చట్టాలు అమలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఏఐటియూసి కార్మికులకు అండగా నిలుబడి సమస్యల సాధనకు పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో ఏఐటియూసి నాయకులు పిట్ల మల్లేశం, కర్ణాల చంద్రం, తయుసుపల్లి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చౌట్కూర్‌లో పొగమంచుతో కప్పుకున్న జాతీయ రహదారి

పొగమంచు కప్పుకున్న జాతీయ రహదారి

చౌట్కూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త: మండల కేంద్రంలో చలి తీవ్రత పెరిగింది. రోడ్లు దట్టమైన పొగంచుతో కప్పుకున్నాయి. మంగళవారం ఉదయం 7 గంటలు దాటినా పొగమంచు తగ్గడంలేదు. జాతీయ రహదారి 161పై వాహనదారులు పొగమంచుతో ఎదురుగా ఏముందో తెలియక ఇబ్బందులపడ్డారు. పొగమంచు కురుస్తుండడంతో రైతులు సాగు చేసుకుంటున్న కంది, మిరప పంటలు చీడపీడలకు సోకి తెగుళ్ల బారిన పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటా సర్వే పక్కాగా చేపట్టాలి

-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఇతర అధికారులు

సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 29 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాలో కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టరేట్ నుండి కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాహుల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలన్నారు. సర్వేకి వెళ్లే ఎన్యుమరేటర్‌కి ఒక ఐడీ కార్డు జారీ చేస్తామని, మండల స్థాయిలో ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫైనల్ ఫార్మాట్‌కి అనుగుణంగా సర్వేలో వివరాలు సేకరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు మహిపాల్ రెడ్డి, రమాదేవి, జయచంద్రా రెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీరామ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హమీద్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హమీద్ కలెక్టరేట్‌లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో హైదరాబాద్ ఎలక్షన్ సీఈవో కార్యాలయంలో పనిచేసి బదిలీపై జిల్లాకు వచ్చారు. జిల్లాపై పూర్తి అవగాహన పెంచుకొని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్నివర్గాల ప్రజలకు సమర్థవంతంగా అందేలా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇక్కడ జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

ఎంఎస్ఆర్ యువసేన సేవలు విస్తరించాలి

-మంత్రి దామోదర రాజనర్సింహ

కొల్చారం, అక్టోబరు 29 ప్రభాతవార్త: ఎంఎస్ఆర్ యువసేన సేవలను నర్సాపూర్ నియోజకవర్గంతో పాటు ఆందోల్ నియోజకవర్గానికి విస్తరింప చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహను కొల్చారం మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన ఎంఎస్ఆర్ యువసేన అధ్యక్షుడు సాయిచరణ్ ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహను సాయిచరణ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఎంఎస్ఆర్ యువసేన సేవలను నర్సాపూర్ నియోజకవర్గంలోని ఆందోల్ నియోజకవర్గానికి విస్తరింప చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలి

పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్.చౌహాన్

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్.చౌహాన్ సూచించారు. ధాన్యం కొనుగోలుపై మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేసి మాట్లాడారు. మిల్లర్లతో సమావేశం నిర్వహించి మిల్లింగ్‌లో సమస్యలు రాకుండా చూడాలన్నారు. జిల్లాలో ఎక్కడ మిల్లింగ్ తక్కువగా జరుగుతుందో తెలుసుకొని అక్కడ తనిఖీలు నిర్వహించి మిల్లింగ్ వేగవంతం చేయాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు, అక్రమాలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా తప్పులు జరిగినట్లు తెలిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు కొనుగోళ్లు చేయాలన్నారు. ఎవైనా ఇబ్బదికర సమస్యలు వస్తే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సివిల్ సప్లై అధికారి తనూజ, డిఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఎస్ఓ తనూజ, తదితరులు

రైతులకు అండగా ఉంటాం

రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త

పార్టీలకతీతంగా రైతులకు అండగా ఉంటామని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం పోతారం(ఎస్) గ్రామంలో ఆర్‌కె జిన్నింగ్ మిల్లులో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ) ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే కేంద్రంలో ఉన్న రాష్ట్ర ప్రతినిధులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్రంలో ఉన్న 322 పత్తి కొనుగోలు కేంద్రాలలో సిసిఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కొనుగోళ్లు వచ్చే సెప్టెంబరు వరకు జరుగుతాయని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. పత్తిలో తేమ శాతం నిబంధనలకు లోబడి ఉంటే మద్దతు ధర రూ. 7500 పొందవచ్చన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం మూడు జిల్లాల్లో ఉన్నందున ముగ్గురు కలెక్టర్లు ధాన్యం,పత్తి కొనుగోలు విషయాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు ప్రక్రియ ఏవిధంగా సాగుతోందని ప్రతీ రోజు మానిటరింగ్ జరుగుతుందన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు. ఇక ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇది వరకే ప్రారంభమయ్యాయని కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల వద్ద సేకరించిన ధాన్యానికి సంబందించి 20 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లకు ఇంకా కేటాయింపు జరగలేదని, జీరో డ్యూటీ ఉండి ప్రభుత్వానికి మంచిగా కేటాయింపు జరుగుతోందన్నారు. మిల్లర్ల కేటాయింపుతో పాటు 60 నుండి 70 శాతం వరకు మంచిగా చేసిన వారికి 10 శాతం బ్యాంక్ గ్యారంటీ ఇచ్చి అవకాశం ఇస్తామన్నారు.ఇప్పటి వరకు కొనుగోల్ల విషయంలో మిల్లర్లకు కేటాయింపు జరగలేదని,దీని ద్వార ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆగదని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మార్కెట్ గోదాంను సందర్శించిన కలెక్టర్...

హుస్నాబాద్‌లోని ఆధునిక వ్యవసాయ మార్కెట్‌ను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సందర్శించి పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత సెంటర్ల నుండి లారీల్లో గోదాంకి వచ్చిన వెంటనే దిగుమతి చేసుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి జైను లొద్దీన్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఎఎంసి గోదాంలో మొత్తం 6 షెడ్లకు 1 షెడ్డు మాత్రమే ఖాళీగా ఉందని మిగతా షెడ్లలో ఏముందని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నందున షెడ్లు ఖాళీచేసే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, జిల్లా లైబ్రరీ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి,కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వే విషయంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా మధిర మండల తహసీల్దార్ కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం నుండి రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట కలెక్టర్ మను చౌదరిలు పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని, ఈ కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు ఇది గొప్ప అవకాశం అన్నారు. కాన్ఫరెన్‌లో హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి తదితరులు ఉన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

సిద్దిపేట రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయడంతో పాటు సిద్దిపేటలో ప్రభుత్వ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన సిఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనలు నాయకులు సంగెం మధు,వేల్పుల ప్రసన్నకుమార్, మిట్టపల్లి సుధాకర్, జక్కుల అనిరుధ్, బాణోత్ నవీన్,రమేష్,రాజేందర్,శ్రావణ్, వర్శిత, రమ్య, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

రామాయంపేట పిఎసిఎస్ చైర్మన్ బాదె చంద్రం

రామాయంపేట, (చల్మెడ) అక్టోబర్ 29, ప్రభాతవార్త : అన్నదాతలు అహర్నిశలు కష్టపడి పండించిన పంటను ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులకు అమ్మి మోసపోవద్దని రామాయంపేట పిఎసిఎస్ చైర్మెన్ బాదె చంద్రం సూచించారు. మంగళవారం నిజాంపేట మండలంచల్మెడ గ్రామంలో రామాయంపేట సొసైటీ చైర్మెన్ బాదె చంద్రం ఆధ్వర్యంలో పంట కొనుగోలు కేంద్రంను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎపిఎసిఎస్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తొందరపడి రైతులు ఎవరు తమ పంటను దళారులకు అమ్మవద్దని తెలిపారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని అన్నారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకోవడానికి తమ సంఘం ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ పోచమ్మల ఐలయ్య,తాజా మాజీ సర్పంచ్ చప్పట నరసింహారెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ నంద్యాల బాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తుమ్మల రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు నంద్యాల మోహన్‌రెడ్డి, బాజ గౌరయ్య, సంఘీపు నారాయణ, కాకి రాజయ్య, భాగ్య నాగరాజు, బాజా రమేష్, నంద్యాల యాదవరెడ్డి, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యువ కవి శ్రీకృష్ణగ్రిల్లర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

యువకవిని సన్మానించిన మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త: పట్టణానికి చెందిన యువ కవి శ్రీకృష్ణ గ్రిల్లర్..ఎందిరా ఈ పంచాయతీ అనే సినిమాలో తలిచె తలిచె అనే పాటను రాయగా పెద్దపల్లి రోహిత్ సంగీతం సమకూర్చగా ప్రముఖ సింగర్ సునీత ఈ పాటను పాడడం జరిగింది. నాన్నపై రాసిన ఈపాట అద్భుతంగా సోషల్ మీడియాలో సక్సెస్ కావడంతో స్పందించిన నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ శ్రీకృష్ణగ్రిల్లర్‌ను శాలూవాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ నర్సాపూర్‌కు చెందిన శ్రీకృష్ణగ్రిల్లర్ కవిగా మారడం ఎంతో అనందంగా ఉందన్నారు.ఇకముందు ముందు ఇంకా ఎన్నో పాటలు రాయాలని అన్నారు. మంచి మంచి పాటలు రాసి నర్సాపూర్ పట్టణానికి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని, అదేవిధంగా కవిగా ఉన్నత ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పంబళ్ళ రాంచందర్, కుమ్మరి నాగేశ్, యాదగిరి,నాయకులు గణేశ్‌గౌడ్, రామకృష్ణ, మల్లేష్, వెంకటేశ్, షరీఫ్, సల్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఒత్తిడి వల్లే ఫాంహౌజ్‌పై దాడులు

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త: బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ అస్థిత్వాన్ని దెబ్బతీయడానికే పాం హౌజ్‌పై ప్రభుత్వం దాడులు చేయించిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఫాంహౌజ్‌పై దాడిని తీవ్రంగా ఆమె ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో ప్రభత్వ వైఫల్యాలను ఎండగడుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ మాజీ మంత్రి కెటిఆర్, బావమరిది ఫాంహౌజ్‌పై దాడులు చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి కెటిఆర్ బావమరిది గృహప్రవేశానికి సంబంధించి ఫాంహౌజ్‌లో ఏర్పాటు చేసిన విందులో భాగంగా మాజీ మంత్రి కెటిఆర్ కుటుంబ సభ్యులను ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంలో కెటిఆర్ అస్తిత్వాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వం నుండి ఒత్తిడి రావడం వల్ల ఈ దాడి జరిగిందన్నారు. దాడుల సమయంలో ఎక్సైజ్ అధికారులు బయటకు వచ్చి మీడియా సమావేశంలో ఫాంహౌజ్‌లో ఎటువంటి మాదక ద్రవ్యాలు లేవని చెప్పడం జరిగిందన్నారు. ప్రతిపక్షాల నోరు నొక్కి వేయడానికి ప్రభత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి వెల్లడించారు.

ఉపాధి హామీ పనుల్లో అనేక అక్రమాలు

-సామాజిక తనిఖీలో అవినీతి తేటతెల్లం.. విధుల నుంచి సంగమేశ్వర్ తొలగింపు

అల్లాదుర్గం, అక్టోబరు 29, ప్రభాతవార్త:

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలో చేపట్టిన పనుల్లో అవినీతి అక్రమాలు చోట చేసుకున్నాయి. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 14వ విడత సామాజిక తనఖీ ప్రజా దర్బార్‌లో అవినీతి తేటతెల్లమయింది. మండలంలోని ఆయా గ్రామాల్లో పనులు చేయకుండానే చేసినట్లు రికార్డుల్లో నమోదుచేసి డబ్బులు కాజేసినట్లు అధికారులు గుర్తించారు.అల్లాదుర్గంతో పాటు ముస్తాపూర్, కాయిధంపల్లి తదితర గ్రామాల్లో పనులు చేయకుండా చేసినట్లు హాజరు వేసి డబ్బులు కాజేసినట్లు తనిఖీలో వెల్లడయింది. బతికున్నాళ్లే కాకుండా గతంలో తిరిగిరాని లోకాలకు చేరుకున్న వ్యక్తులు సైతం పనులకు హాజరైనట్లు రికార్డుల్లో హాజరు వేసి అవినీతికి పాల్పడినట్లు తేట తెల్లమయింది. సంతకాలు లేకుండానే పేమెంట్స్ చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఆరోపణలు గుప్పుమన్నాయి. మండలంలోని 16 పంచాయతీలలో 2023 నుంచి 2024వరకు 312 పనులు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. 312 పనులకు మెటీరియల్‌కుగాను 3 కోట్ల 58లక్షల 64వేల 274 రూపాయలు వినియోగించినట్లు ఏపీడి రంగాచారి తెలిపారు. పంచాయితీరాజ్‌లో చేపట్టిన 36 పనులకు మెటీరియల్‌కుగాను 1 కోటి 87లక్షల 75వేల 145 రూపాయలు ఉపయోగించారన్నారు. ఇందులో 3లక్షల 74వేల 620 రూపాయలను రికవరీ చేసి 5900100 రూపాయల పెనాల్టి వేశామన్నారు.

గత సంవత్సరం రికవరీ శాతం 50 శాతం అయినట్లు తెలిపారు. కాగితంపల్లి మెట్టు సంగమేశ్వర అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు రుజువైందని, సంగమేశ్వర్‌ను విధుల నుంచి తొలగించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డివిపో శ్రీహరి, వ్ఆర్వ రఘు, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఏపిఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న ఏపిడి రంగాచారి

ఎంపికైన క్రీడాకారులు

సౌత్ ఇండియా యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు ముగ్గురు క్రీడాకారుల ఎంపిక

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29,ప్రభాతవార్త : ఈ నెల 23వ తేదీన కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో జరిగిన కబడ్డీ పోటీలలో హుస్నాబాద్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు గడిపె సిద్దు, ఎండీ ఆల్వాజ్, కోయిలకరి శ్రీశైలంలు చెన్నైలో ఈనెల 30న జరిగే సౌత్ ఇండియా యూనివర్సిటీ టీంకు ఎన్నికైనట్లు కబడ్డీ కోచ్ మడక కృష్ణ తెలిపారు.వీరి ఎంపిక పట్ల రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్నలు హర్షం వ్యక్తం చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్‌వోసిని అందజేసిన ఎమ్మెల్యే

నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు సిఎంఆర్ఎఫ్ రూ. 2 లక్షల ఎల్‌వోసిని మంగళవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. వెల్దుర్తి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఎం.ప్రవళ్లిక అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని పంజాగుట్ట ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇందుకు గాను ఆమె ఆపరేషన్ నిమిత్తం రూ. 2 లక్షల అవసరమున్నందున సిఎంఆర్ఎఫ్ నుండి 2 లక్షలు మంజూరు కాగా అట్టి 2 లక్షల ఎల్‌వోసిని ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా బాదితులకు అందజేయడం జరిగింది అందజేయడం జరిగింది. అదేవిదంగా కౌడిపల్లి మండలం చందూర్ గ్రామానికి చెందిన పోచయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యానికిగురై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన 27 వేలరూపాయిల చెక్కును హైద్రాబాద్‌లో ఎమ్మెల్యే సునీతా రెడ్డి చేతుల మీదుగా అందించారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, రింగుల ప్రసాద్, జగపతి, తదితరులుపాల్గొన్నారు.

మృతిచెందిన పాడిగేదె

విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతి

జగదేవ్‌పూర్, అక్టోబరు 29 (ప్రభాతవార్త): ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి పాడిగేదె మృతిచెందిన సంఘటన జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామంలో జరిగింది.వివరాలిలా ఉన్నాయి. చాట్లపల్లి గ్రామానికి చెందిన గోక నర్సింలు పాడి గేదెను సోమవారం రాత్రి రోజులాగే పొలం వద్ద పశువుల పాకలో కట్టేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం వెళ్లిచూడగా గేదె పొలానికి దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్ తగిలి మృతిచెంది ఉంది. పాడిగేదె మృతితో సుమారు రూ.70వేల వరకు నష్టం జరిగిందని, జీవనోపాధికి తెచ్చుకున్న గేదె మృతితో తనకు నష్టం జరిగిందని, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని రైతు నర్సింలు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత

కాంగ్రెస్ పార్టీని ఎదురులేని శక్తిగా తయారు చేస్తున్నాం
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ కార్పోరేటర్ సాగర్‌గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ఎదురులేని శక్తిగా తయారు చేస్తున్నామని శాసన సభ్యులు టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం బండ్లగూడ కార్పోరేషన్‌కు చెందిన కొంత మంది కార్పోరేటర్ బి.సాగర్‌గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయంలో నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న వారికే ప్రజలు ఎన్నికల్లో అండగా ఉండి తమ ప్రతినిధిగా గెలిపించుకుంటారని తెలిపారు. నాయకుడు తలలో నాలుకవలే నిత్యం ప్రజల మధ్యనే ఉండాలని సూచించారు. యువకుడు, ఉత్సాహవంతుడైన కార్పోరేటర్ సాగర్‌గౌడ్ నిత్యం ప్రజల ఇబ్బందులను నా దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరింపచేసుకుంటున్నాడన్నారు. సాగర్ ఓవైపు ప్రజలకు అండగా ఉంటూనే మరోవైపు పార్టీని పటిష్టం చేస్తున్న తీరు ముచ్చటగొలుపుతుందన్నారు. పదవుల కోసం రాజకీయం చేస్తామంటే కుదరదని, అంకితభావంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశించే ప్రతీ కార్యక్రమాన్ని స్థానికంగా విజయవంతం చేసిన నాయకులకు పార్టీలో ప్రాధాన్యత లభిస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతీ కార్యకర్తకు పూర్తి అండగా నిలుస్తామని, ఏ ఇబ్బంది వచ్చినా మా దృష్టికి తీసుకు రావాలని ప్రకాశ్‌గౌడ్ సూచించారు.

దాతృత్వంను చాటుకుంటున్న మాజీ సర్పంచ్ స్వరూప నాగేష్ యాదవ్

నార్సింగి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొల్ల స్వరూప నాగేష్ యాదవ్ మరోమారు తన దాతృత్వంను చాటుకున్నారు. గత పదేళ్ల నుంచి నిరుపేద యువతుల వివాహాల కోసం పుస్తెమెట్టెలు చేయిస్తూ, ఆర్థిక సహాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు. సర్పంచ్ పదవి దిగిపోయి ఏళ్లు గడుస్తున్నా పేదలకు ఆపన్న హస్తం ఇవ్వడంను మాత్రం మానడం లేదు. ఆపద ఉందని చేయిచాచి అడిగిన ప్రతీ ఒక్కరికి తనవంతు సహాయం చేసి పంపడమే ఆమెకు తెలుసు. ఇప్పటి వరకు తన వద్దకు వచ్చిన ఏ ఒక్కరిని కూడా వట్టిచేతులతో పంపించలేదు. తాజాగా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి తాండాకు చెందిన నిరుపేద కొండయ్య కూతురి చదువు కోసం ఆర్థిక సహాయం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, గైడ్లు ఇప్పించడంతో పాటు పరీక్షా కేంద్రాలకు వెళ్లి వచ్చేందుకు ఆటోలను ఏర్పాటు చేయడం, పేద యువతులకు పుస్తెమెట్టెలు చేయించడం, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ స్వరూప నాగేష్ యాదవ్‌కే చెల్లింది. నేను నమ్ముకున్న దేవుడు నాకు అన్ని రకాలుగా అండగా నిలిచాడని, నన్ను నమ్ముకొని ఉన్న వారికి నేను అండ గా ఉంటున్నానని, ఆ దేవుడి ఆశీర్వాదంతో ఈ ఆర్థిక సహాయం నిరాటంకంగా చేస్తూనే ఉంటానని స్వరూప యాదవ్ స్పష్టం చేశారు.

పోస్టు కార్డులతో నిరసన ఉద్యమం

పోస్టుకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న టీఆర్ఎస్ నాయకులు శ్రీనునాయక్, విద్యార్థులు

తార్నాక, అక్టోబర్ 29 ప్రభాతవార్త: ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు శ్రీనునాయక్ తలపెట్టిన పోస్టుకార్డుల ఉద్యమాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం శ్రీమేధా కళాశాల, బిజినెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో సీఎంకు పోస్టుకార్డులు రాయించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు శ్రీనునాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామిని నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలతో యువ వికాస్, టెన్త్ ఫాస్ అయిన వారికి రూ.50 వేలు, ఇంటర్ ఫాస్ అయిన వారికి లక్ష రూపాయలను, డిగ్రీ విద్యార్థులకు రెండు లక్షలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.ఐదు లక్షలు ఇస్తామని మోస పూరిత హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించారని ఆరోపించారు. విద్యార్థుల ఫీజు బకాయిలను కూడ చెల్లించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. పోస్టుకార్డుల ఉద్యమంతోనైనా ప్రభు త్వం దిగిరావాలన్నారు. కార్యక్రమంలో ఒ.యూ విద్యార్థి నాయకుడు నవీన్ నాయక్, ప్రవీణ్ నాయక్,విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేద్దాం

సాయిబాబాను సత్కరిస్తున్న టీడీపీ నేతలు

ముషీరాబాద్, అక్టోబర్ 29, ప్రభాతవార్త: తెలంగాణాలో తెలుగు దేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ పి.సాయిబాబా పిలుపునిచ్చారు. మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా తెలంగాణాలో 17 పార్లమెంటు కమిటీలకు కన్వీనర్లను అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్‌గా తిరిగి నియమితులైన సాయిబాబాను సికింద్రాబాద్ పార్లమెంట్ కమిటీ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు మరియు తెలంగాణ రాష్ట్ర నాయకత్వం తనపై నమ్మకంతో ఉంచిన బాధ్యతలను వమ్ముచేయకుండా పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం అహర్నిశలూ పాటుపడుతున్న కార్యకర్తలకు, నాయకులకు, పార్టీ అభిమానులకు, శ్రేయోభిలాషులకు ఆయన ధన్యవాదములు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, పెద్దోజు రవీంద్రాచారి, ఎస్.ప్రకాష్, భిక్షపతి చారి, సి.విఠల్, దానం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశవాళీ క్రికెట్‌లో అల్‌రౌండ్ ప్రతిభ కనబరుస్తున్న టీఎన్ఆర్ మోహిత్

దేశవాళీ క్రికెట్‌లో ప్రతిభకనబరుస్తున్న క్రికెటర్ టీఎన్ఆర్ మోహిత్

శేరిలింగంపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త

దేశవాళీక్రికెట్‌లో ఆల్‌రౌండర్ ప్రతిభ కనబరుస్తున్న టీఎన్ఆర్ మోహిత్ అరుణాచల్ ప్రదేశ్ సీనియర్ పురుషుల జట్టులో క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన తడకమల్ల నర్సింగ్‌రాజ్ మోహిత్,టీఎన్ఆర్ మోహిత్‌గా పేరుపొందారు. మోహిత్ అరుణాచల్ ప్రదేశ్ సీనియర్ పురుషుల జట్టుకు 2024-25కు దేశీయ క్రికెట్ సీజన్‌కు అతిథి ఆటగాడిగా ఆడేందుకు సన్నద్ధమవుతున్నారు.తన 23వ ఏట 2023లో రంజిట్రోఫీ జట్టుతో సహా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు కీలకమైన ఆల్‌రౌండర్ ప్రతిభను చాటిన ఆటగాడిగా నిలిచారు. ఏడేళ్ల వయస్సులో క్రికెట్ ఆటను ఆడటం ప్రారంభించిన మోహిత్ ప్రతిభ తక్కువ సమయంలోనే దేశీయ క్రికెట్ లోకానికి ప్రస్ఫుటమైంది. అతను 2018లో అండర్ 19 నేషనల్ స్కూల్ గేమ్స్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించారు. అదే విధంగా హైదరాబాద్ క్రికెటర్లీగ్‌లో అతని బలమైన ప్రదర్వనలు అతనికి 2021-22 సీజన్‌లో సీకే నాయుడు ట్రోఫీ జట్టులో చోటు సంపాదించిపెట్టాయి. మాజీ బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ యంఎస్‌కే ప్రసాద్,హైదరాబాద్ వెటరన్ కన్వల్ జీత్ సింగ్‌లచే మెంటార్ చేయబడిన మోహిత్ నమ్మకమైన రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నర్‌గానూ, సమర్థుడైన కుడిచేతివాటం బ్యాట్స్‌మన్‌గా ఎదిగాడు. మోహిత్ తన వ్యక్తిగత నైపుణ్యాలతో పాటు జింబాబ్వే అండర్ 23 జట్టు,న్యూజిలాండ్ హాట్ హాక్స్ వంటి అగ్ర ప్రత్యర్థి ఆటగాళ్లకు వ్యతిరేకంగా యంఎస్‌కేప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ జట్టుకు కెప్టెన్‌గా నాయకత్వ సామార్థ్యాన్ని ప్రదర్శించాడు. అతని స్థిరమైన ఆల్ రౌండ్ ప్రదర్శనలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. క్రికెట్‌లో నిలదొక్కుకుంటూ ఒక్కోక్క అడుగు వేసుకుంటూ కీర్తి శిఖరాలకు ఎదుగుతున్న మోహిత్ తనదైన ముద్రవేసుకుంటున్నారు. అరుణాచల్ ప్రదేశ్ వెళ్లడంతో మోహిత్ హైదరాబాద్ రంజీ ట్రోఫీ జట్టులో ఆడిన అనుభవాన్ని సంపాదించారు.భారత దేశవాళీ క్రికెట్‌లో కొత్త సవాళ్లను స్వీకరిస్తూ, మైదానంలో విస్మృత ప్రభావాన్ని చూపే లక్ష్యంతో అతని ఆల్ రౌండ్ నైపుణ్యాలు, నాయకత్వం, సమర్థవంతమైన ఆటగాడిగా టీఎన్ఆర్ మోహిత్ ముందుకు సాగుతూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. ఇటీవలే అహ్మదాబాద్‌లోని నరేంద్రమోడి స్టేడియం గ్రౌండ్ బిలో సిక్కిం,అరుణాచల్ జట్లమధ్య జరిగిన రంజీట్రోఫీ మ్యాచ్‌లో టీఎన్ఆర్ మోహిత్ ఆల్‌రౌండర్ ప్రతిభ కనబరిచారు. రెండో ఇన్నింగ్‌కు 35.2ఓవర్లలో 169 రన్స్ ఇచ్చి 9వికెట్లను పడగొట్టారు. ఇందులో 12.2 ఓవర్లు వేసిన మోహిత్ 3.08 ఎకనామితో 38 పరుగులు ఇచ్చి ఆరువికెట్లు తీసిన ఘనత మోహిత్‌కు దక్కింది. దీంతో మోహిత్ దేశీవాళీ క్రికెట్‌లో తనదైన శైలిలో ప్రతిభ కనబరుస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.

వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం

బేగంపేట అక్టోబరు 29,ప్రభాతవార్త

ఆరోగ్య పరిరక్షణలో పురోగతి ఉన్నప్పటికీ బాగా చదువుకున్న వారు మరియూ సంపన్న వర్గాల్లో కూడా గుండె సంబంధ సంఘటనలతో పోలిస్తే బ్రెయిన్ స్ట్రోక్ గురించి అవగాహన పరిమితంగానే ఉంది.చాలా మంది రోగులు స్ట్రోక్ లక్షణాలను పట్టించుకోకుండా విస్మరించడం కారణంగానే చాలా ఆలస్యంగా ఆసుపత్రులకు చేరుకుంటున్నారు. వరల్డ్ స్ట్రోక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బేగంపేటలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో స్ట్రోక్ లక్షణాలను గుర్తించడం,మరియూ సకాలంలో వైద్య సేవలు ఎలా తీసుకోవాలనే ప్రాముఖ్యతను తెలియజేస్తూ మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ గోపాల్,డాక్టర్ వినోద్‌కుమార్ ,డాక్టర్ నివేదితద సాయిచంద్రల ఆధ్వర్యంలో స్ట్రోక్ లక్షణాలు ఎలా ఉంటాయి,వాటిని ఎలా గుర్తించాలి ఎంత త్వరగా వైద్యసేవలు అందించాలనే విషయాలపై వైద్యులు అవగాహన కల్పించారు.స్ట్రోక్ తో బాధపడుతూ చికిత్స అనంతరం కోలుకున్న పేషెంట్‌కు అందించిన చికిత్సలను ఈ సందర్భంగా తెలియజేసారు.నిర్ధారణ కంటే నివారణ చాలా ముఖ్యమని ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు.రోజువారి వ్యాయామం,జీవనశైలిలో మార్పుల ద్వారా బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చన్నారు.బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలను గుర్తిస్తే బిఫాస్ట్ చేయాలని సూచించారు.బి.బ్యాలెన్స్ తప్పడం,ఈ ఆకస్మిక దృష్టిలోపం,ఎఫ్ ముఖం ఒక వైపు వంగిపోవడం,ఏ చేతులు బలహీన పడటం,ఎస్.మాట్లాడటంలో ఇబ్బంది.టి.వెంటనే స్పందించడం అన్నారు.స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం చాలా ముఖ్యమైందన్నారు.ప్రతి నిమిషానికి మెదడులో మిలియన్ల కొద్ది నరాలు దెబ్బతినడం,జ్ఞాపక శక్తిని,పనితీరు శాశ్వతంగా కోల్పోయేలా చేస్తుందన్నారు. సరైన చికిత్స కోసం అత్యవసర సేవలు ఎంఆర్ఐ, సిటీ స్కాన్ ,బిసీయూ సేవలతో పాటు న్యూరాలజిస్ట్ ,న్యూరో సర్జన్ సిద్ధంగా ఉన్న ఆసుపత్రికి రోగిని తరలించాలని వారు తెలియజేసారు.

పరిశ్రమలు స్థాపించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి
-స్టూడెంట్ ట్రైబ్ వ్యవస్థాపకులు చరణ్ లక్కరాజు

అవంతి పీజీ కాలేజి ఫేర్‌వెల్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న చరణ్ లక్కరాజు

హైదరాబాద్, అక్టోబర్ 29, ప్రభాతవార్త: విద్యార్థులందరూ స్వశక్తితో నూతన పరిశ్రమలు స్థాపించగలిగే స్థాయికి ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి చరణ్ లక్కరాజు సూచించారు. మంగళవారం అవంతి పీజీ కళాశాల ఫేర్‌వెల్ కార్యక్రమం నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చరణ్ లక్కరాజు, ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టర్ జహంగీర్, డాక్టర్ పి.మురళీధర్‌రెడ్డి లతో కలసి హాజరయ్యారు, ముందుగా అవంతి సంస్థల వ్యవస్థాపక అధినేత ముత్తం శెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథులతో కలసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చరణ్ లక్కరాజు మాట్లాడుతూ విద్యార్థులు వినయవిధేయతలతో, విమర్శనాత్మక దృష్టితో ముందుకు సాగాలని అన్నారు. డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు కార్యసాధన దీక్ష ఉండాలని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. డాక్టర్ జహంగీర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం కలిగి, తమ లక్ష్యాలను సాధించుకోవాలని అన్నారు. కళాశాల వ్యవస్థాపకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను కష్టపడి సాధించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్‌మెన్ సంక్షేమానికి మజ్దూర్ యూనియన్ నిరంతరం కృషి : శంకర్ రావ్

కంటోన్మెంట్,అక్టోబర్ 29 ప్రభాతవార్త:

రైల్వే ట్రాక్ మెన్‌ల సంక్షేమం కోసం మజ్దూర్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని మజ్దూర్ యూనియన్ నేత సి.హెచ్.శంకర్ రావ్ పిలుపునిచ్చారు. రైల్వే ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం మజ్దూర్ యూనియన్ చేపడుతున్న పోరాటాల పట్ల ఆకర్షితులై ట్రాక్ మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్‌మూర్తి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌లతో పాటు మరి కొంత మంది ట్రాక్ మెన్‌లు మంగళవారం మజ్దూర్ యూనియన్ నేత శంకర్ రావ్ సమక్షంలో చేరారు. ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జోనల్ నాయకులు శ్రీనివాస్, చిలుకు స్వామి, నర్సింహ్మారెడ్డి, సమ్మయ్య, వై.స్వామి, ఐలయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బౌరంపేటలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్

దుండిగల్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 20వ వార్డులోని జెఎన్ఎన్ యుఆర్ఎం లక్ష్మీనగర్ కాలనీలో కౌన్సిలర్ మురళి యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 80లక్షల రూపాయలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే కెపి వివేకానంద్, మున్సిపల్ చైర్ పర్సన్ శంభీపూర్ కృష్ణవేణి క్రిష్ణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ శివారు ప్రాంతాలలో కొత్తకొత్త కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని, జనాభా అభివృద్ధికి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, నర్సా రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బెంబడి బుచ్చిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డిల్లెశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, సలహాదారులు కామేశ్వర్‌రావు, కాలనీ వాసులు లక్ష్మణ్, శ్యామ్, బాబీ, కాలనీవాసులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ని ప్రోత్సహిస్తారా.. ఇదేమి వైఖరి..? : కోట నీలిమ

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త

జన్వాడ ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీ గురించి తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే.. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న కామెంట్స్‌పై తనదైన శైలీలో స్పందించారు సనత్‌నగర్ కాంగ్రెస్ ఇంచార్జీ కోట నీలిమ. అనుమతి లేకుండా పార్టీ జరుగుతుందని సమాచారంతో పోలీసులు చర్యలు తీసుకోగా దానికి రాజకీయ కోణాన్ని ఆపాదించి పబ్బం గడుపుకునేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అది కుటుంబ పార్టీ అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మద్యం సీసాలు, మత్తుమందు పరీక్షలో ఓ వ్యక్తికి పాజిటివ్ అని తేలినా, దానిని కవర్ చేసుకునేందుకు బురదజల్లే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు మనం ఇచేనచ సందేశం ఇదేనా అని ప్రశ్నించారు. గ్రేటరన హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చుకునేందుకు అంతా కలిసి రావాల్సిందిపోయి వారికి మద్దతు ఇచ్చేలా మాట్లాడటం సరికాదన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎవరికి అనుకూలంగా మాట్లాడుతున్నారో తెలుసన్నారు. గత పది సంవత్సరాల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో చట్ట విరుద్ధంగా డ్రగ్స్, రేవ్ పార్టీలు జరిగినా చర్యలు తీసుకోలేదు కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంటే దానిలో కూడా తప్పును వెతకడం సరికాదన్నారు.

స్వామివివేకానంద నగర్ బస్తీ వాసులకు ఇందిరమ్మ ఇళ్ళు
-మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త:

త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ళ పథకం కింద స్వామివివేకానంద నగర్ బస్తీ వాసులకు నిర్మించి ఇచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్ నేతృత్వంలో ప్రతినిధి బృందం మంత్రిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ బస్తీవాసులకు న్యాయం చేయకుండానే బాధితుల ఇళ్ళను ఎలా కూల్చివేశారని ప్రశ్నించారు. ఇళ్ళను కూల్చిన ప్రదేశంలోనే రోడ్డు నిర్మిస్తున్నారని, బస్తీవాసులు రోడ్డు నిర్మాణానికి సంబంధించి కోర్టు ఆర్డర్ కాపీని చూపించాలని డిమాండ్ చేయడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు వెనుదిరిగారనిమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కలెక్టర్‌తో సమీక్షించి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్తీ బాధితులు ఎంబి.కృష్ణ, శ్యామ్‌సుందర్, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, తిలక్‌బాబు, బిజెపి నేతలు ఎం.ఉమేశ్, సాయికుమార్, అశోక్‌యాదవ్, జగదీష్, బాబ్జీ, పున్న సత్యనారాయణ, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాపు బ్నిం అనుబంధాల పరిమళం బాపుగారితో నేను పుస్తకం

నాంపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త : భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి ఉపదేశించినట్లుగా బాపు కృష్ణుడి స్థానంలో బ్నిం అర్జునుడి స్థానంలో ఉండి ఆ భగవద్గీతో పదేశం పొందుతున్నట్లు ఉంది బ్నిం రచించిన బాపుగారితో నేను పుస్తకం అన్న తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి బాపుతో బ్నింకు ఉన్న అనుబంధానికి నిదర్శనం ఈ పుస్తకమని అభివర్ణించారు. పి.వి.నరసింహారావు భారత ప్రధానమంత్రి అయినప్పుడు ఒక తెలుగువాడు దేశప్రధాని అయినందుకు నాటి సమైక్య ఏపి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఆయన్ను సత్కరించుకొనేందుకు రవీంద్ర భారతిలో ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో అద్భుత బ్యాలేను అందించి సహాయం చేశారని, ఇచ్చేటప్పుడు గుర్తుపెట్టుకోవద్దు, తీసుకున్నప్పుడు మాత్రం మరచిపోకూడదు .... అని చాలామంది అన్నట్లు బ్నిం సహాయాన్ని మరచిపోలేమన్నారు. బాపు రమణ అకాడమీ (ఆత్రేయపురం, హైదరాబాద్) సౌజన్యంతో హాస్యానందం, అక్షజ్ఞ పబ్లికేషన్స్ సంయుక్త నిర్వహణలో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవుపల్లి రామానుజరావు కళామందిరలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి, విశిష్ట అతిథులు డా. సుదర్శన్, డా. ఓలేటి పార్వతీశం, దైవజ్ఞశర్మ, డా. ఉప్పలపాటి కుసుమ, బ్నిం, వెంకట్, రాము తదితరులతో కలిసి బ్నిం రచించిన బాపుగారితో నేను పుస్తకాన్ని, నామ రామాయణం తెలుగు, ఇంగ్లీషు వ్యాఖ్యానం పుస్తకం, ప్రముఖ కార్టూనిస్టు కమల్ గిరీశం కార్టూన్లు పుస్తకాలను ఆవిష్కరించి చివరిగా హాస్యానందం పత్రిక నిర్వహించిన కార్టూన్ పోటీ విజేతలకు బహుమతులను ప్రదానంచేసి ప్రసంగించారు. సభకుముందు జయశ్రీ బృందంచే పాటల పందిరి, ఉమ దేవులపల్లి బృందంచే బ్నిం రచించిన జలసంరక్షణం (కాళీయ మర్దనం) నృత్యప్రదర్శనలు అద్భుతంగా జరిగి ఆహుతులను ఎంతగానో అలరించాయి.

బాపుగారితో నేను పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి, ఓలేటి, బ్నిం, ఝాన్సీ, కుసుమ తదితర అతిథులు

వేటూరి ప్రతి పాటా ఒక వజ్రం
-బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

గాయనీ గాయకులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త: వేటూరి పాటలు సాహితీ సౌరభాలు,ప్రతి పాటా ఒక వజ్రం అని బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో స్వరకళ్యాణి ఆర్ట్స్ నిర్వహనలో 'ఇది నా ప్రియ నర్తన వేళ' పేరుతో వేటూరి సుందరరామమూర్తి రచించిన 'సినీ గీత గానం' జరిగింది. స్వరకళ్యాణి, స్వర భాస్కర్, రామలక్ష్మీ, జయరామ్, జ్యోతి, లత తదితరులు పాడిన పలు వేటూరి పాటలు మధురంగా ఆలపించారు. నాట్యగురువు నిహారిక శిష్యబృందం నైనిక, కిరణ్ తదితరులు 'అరిగిరి నందిని, 'దుర్గాస్తుతి'ని మనోహరంగా నర్తించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు పాల్గొని కళాకారులను అభినందించారు. కిన్నెర సంస్థ అధినే త మద్దాళి రఘురామ్, శశిబాల, రఘురామ్, బద్రీనాథ్, శేఖర్, రామచంద్రరావు, రాధాకృష్ణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రతిభ

క్రీడాకారులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త:

బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ నిర్వహించిన జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ ప

మహిళలు స్థాపించిన యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలి

సెర్ప్ పిఎం ఉమాపతి

నంగునూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త : ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని సెర్ప్ పిఎం ఉమాపతి అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంటర్ప్రైజేస్ గ్రౌండింగ్ వెరిఫికేషన్‌లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని రాంపూర్,సిద్దన్నపేట గ్రామాలలో సెర్ప్ అధికారులు, మహిళలు గ్రామాల్లో నెలకొలపుకున్న ఎంటర్ప్రైజేస్‌ను డీపీఎం కర్ణాకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ప్‌హెల్ప్ గ్రూప్ మహిళలను బతోపేతం చేయడమే సెర్ప్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మహిళలు వ్యాపారంపై మెగ్గుచూపి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు వ్యాపారాలు నెలకొల్పుకోవడానికి బ్యాంకు,గ్రామ సంఘం స్త్రీ నిధి ద్వారా రుణాలు ఇస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆర్థికంగా ముందుకు రావాలన్నారు.కార్యక్రమంలో ఏపీఎం మహిపాల్, సీసీ మల్లేశం, వివోలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఘన సత్కారం

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న హరికృష్ణ

సిద్దిపేట రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త: భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం హైదారాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా మహారాష్ట్ర వెళ్తుండగా పొన్నాల వై జంక్షన్ వద్ద సిద్దిపేట నియోజకవర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. సిద్దిపేటలో పార్టీని మరింత పటిష్టంచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించినట్లు హరికృష్ణ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకోసం సైనికుల్లా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చినట్లు తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఖలీం, పూజల గోపికృష్ణ, సందీప్ యాదవ్, సత్యనారాయణ గౌడ్, మొహమ్మద్ అతిఫ్, చిన్న రశాద్, అజమాత్,రాజు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, అక్టోబరు 29, ప్రభాతవార్త : చేర్యాల మండలం నాగపురి పరిధిలోని గండికుంటలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను జనగామ డీసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, అందెనాని బాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కొమ్మూరి...

చేర్యాల మండలం శభాష్‌గూడెంకు చెందిన విద్యార్థి గాడిపల్లి మనోజ్ గత ఐదు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని చనిపోగా మంగళవారం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు.ఆయనతో కాంగ్రేస్ పార్టీ నాయకులు,తదితరులు ఉన్నారు.

అందమైన చేతి రాత విద్యార్థుల భవిష్యత్‌కు పునాది

చేతి రాతపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొండపాక, అక్టోబరు 29, ప్రభాతవార్త : అందమైన చేతి రాతపై సిర్సనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మద్దుల గోపాలకృష్ణమూర్తి, సతీమణి మద్దుల తాయారమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు మద్దుల వెంకటరమణ కోడలు స్వర్ణలత సహకారంతో అక్షరశిల్పి పురస్కార గ్రహీత గడ్డం యాదగిరితో పాటు స్వర్ణ నంది అవార్డు గ్రహీత గొట్టిముక్కల బ్రహ్మచారి, విద్యార్థులకు అందమైన చేతి రాతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనుసందానకర్తగా గణిత ఉపాధ్యాయుడు పుల్కూరు శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఎఎపిసి చైర్మన్ స్వరూప, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, పొన్నాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణ స్థలంపై వివాదం.. పోలీస్ పికెట్

కొండపాక, అక్టోబర్ 29, ప్రభాతవార్త : తిమ్మారెడ్డిపల్లి మధిర సార్లవాడలో అసైన్డ్ భూమిలో చర్చిని నిర్మిస్తున్నారని కొంత మంది నిర్మాణాన్ని రెండు రోజుల క్రితం కూల్చివేయగా వారిపై కుకునూరుపల్లి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ విషయమై సోమవారం రాత్రి మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు నిర్మాణాన్ని కూల్చి వేసిన వారికి మద్దతుగా కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని రాత్రాంతా హల్‌చల్ చేశారు, తమ కార్యకర్తలపై ఎందుకు కేసులు పెట్టారంటూ పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా చర్చిని ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. చర్చి నిర్మాణం జరిగిన ప్రదేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా కుకునూరుపల్లి పోలీసులు అక్కడ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

వివాదాస్పద స్థలం వద్ద పోలీస్ పికెట్ నిర్వహిస్తున్న దృశ్యం

పేదలకు వైద్య సేవలు అందించాలి : ఎమ్మెల్యే

చేర్యాల, అక్టోబరు 29, ప్రభాతవార్త : పేదలకు ఏకైక సదుపాయం వైద్యం అని వారికి అన్ని విధాల వైద్యసేవలు అందించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించి వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి ప్రజలకు అన్ని రకాల సేవలందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెలే మాట్లాడుతూ రెండు నెలలుగా గైనిక్ వైద్యులు లేక పోవడంవల్ల కనీసం డెలివరీలు కావడం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికే ప్రజలు రాని పరిస్థితుల్లో గత ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించి 80 శాతం ప్రజలు ప్రైవేటు ఆసుపత్రిని సంప్రదించడకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకునేలా చేసిందని తెలిపారు. అలాగే తల్లి, పిల్లలు బాగుండాలని కేసిఆర్ కిట్లు, న్యూట్రేషన్ కిట్లు, రూ.12 వేలు గత ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అప్పటి ప్రభుత్వ హాయంలో శిశు,తల్లుల మరణాలు తగ్గాయని మళ్లీ ఇప్పుడు పెరిగాయన్నారు. రోజురోజుకు సౌకర్యాలు పెరగాల్సిందిపోయి తగ్గుతున్నాయని, పూర్తిస్థాయిలో డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ స్టాఫ్ లేరని వారందరిని నియమించాలని వైద్య మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సూపరింటెండెంట్ దేవేందర్ మున్సిపల్ వైర్‌పర్సన్ ఆంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మరాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చంటి, సతీష్, కనకలక్ష్మి యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు తాజా మాజీ ఎంపిపి ఉల్లంపల్లి కర్ణాకర్, ముస్త్యాల బాల్‌నర్సయ్య, అనంతరుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపిపి శ్రీధర్, శివగారి అంజయ్య, జింకల పర్వతాలు, సిద్దిరాములు, తిరుపతిగౌడ్, తాండ్ర సాగర్ ఉన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన పల్లా...

చేర్యాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు బుడిగే విజయ ఇటివల అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఆయనతో బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

వరంగల్ రోడ్డు పనులకు హుస్నాబాద్ మట్టా...!?

బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త : నిజామాబాద్ నుండి వరంగల్ వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులకు కాంట్రాక్టర్లు అధికారులు కుమ్మక్కై ఎలాంటి అనుమతులు తీసుకోకుండా హుస్నాబాద్ మట్టిని తరలిస్తున్నారని బిఎస్పి నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని పోతారం(ఎస్) గ్రామంలో ఆయన మాట్లాడుతూ పోతారం బైరాన్ చెరువు పక్కన ఉన్న సుందరమైనగుట్టలను పక్క జిల్లాలో నిర్మించే రోడ్లకు తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గుట్టలను తవ్వుతూ వణ్యప్రాణులు జనవాసాల్లోకి వచ్చేలా చేస్తున్నారన్నారు.గుట్టలు తవ్వకాలు మొదలైన నుండి వివిధ రకాల జంతువులు పోతారం, నాగారం గ్రామాలలోకి వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్,రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు స్పందించి గుట్టలు తవ్వే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బాలయ్య, సత్తయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఘనంగా దీపోత్సవం

పటాన్‌చెరు, అక్టోబరు 29,ప్రభాతవార్త: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరబాద్ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం దీపోత్సవం పేరిట దీపావళి వేడుకలను ఉల్లాసభరితంగా, సృజనాత్మకతను చాటేలా నిర్వహించారు. సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో ప్రాంగణం లెక్కలేనన్ని దీపాల వెలుగులతో ప్రకాశించి, చీకటిపై కాంతి,చెడుపై మంచి విజయానికి ప్రతీకగా నిలిచింది. గీతం హైదరబాద్ ప్రాంగణమంతా ప్రతిధ్వనించే సానుకూల శక్తి, పండుగ ఉల్లాసాన్ని స్వాతిస్తే, దీపాల అద్భుత శక్తిని విద్యార్థులంతా కలిసి స్వీకరించారు. దీనికిముందు పర్యావరణ అనుకూలమైన దీపాలకు రంగులు వేయడం ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతను వ్యక్తీకరించడమే గాక, పరిసరాలను రంగులమయం చేశారు. ఈ వేడుకకు రంగోలి పోటీ జతకలిసి విద్యార్థుల ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. విద్యార్థులు క్లిష్టమైన డిజైన్‌లను ప్రదర్శించి, దీపావళి ఉత్సవాలలో అంతర్లీనంగా ఉన్న కళాత్మక స్ఫూర్తిని చాటి చెప్పారు. ఈ ఆహ్లాదకరమైన సంస్కృతుల కలయికలో స్పార్క్ అండ్ స్పిరిట్స్ పేరిట హాలోవీన్‌ను కూడ గీతం విద్యార్థులు నిర్వహించారు. భోగి మంటలు వెలిగించి, దెయ్యాలు పారద్రోలెందుకు సృజనాత్మకత దుస్తులను ధరించి,ఈ భయానక వేడుకలో పాల్గొన్నారు. దీపావళి, హాలోవీన్ ఉత్సవాల ఈ ప్రత్యేక సమ్మెళనం విద్యార్థులలో అనందాన్ని పెంపోందించింది.

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్న బిఆర్ఎస్ నేతలు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు



మాట్లాడుతున్న అత్తు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఇచ్చినమాట నిలబెట్టుకున్న ఘతన సిఎంనరేవంత్‌రెడ్డి సర్కార్‌కే దక్కుతుందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)అన్నారు. మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నాయకులు అర్థం,పర్థం లేకుండా ఆరోపణలు, విమర్శలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు డిఎలు పెండింగ్ పెడితే సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కలు సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మూసినది సుందరీకరణకు సిఎం కృషి చేస్తుంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందన్నారు.సమావేశంలో పార్టీ నాయకులు తప్పెట శంకర్, మధు, గయాజుద్దీన్, అనిల్, సంతోష్‌గౌడ్, చేపూరి సిద్దిరాములుగౌడ్ పాల్గొన్నారు.

కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వర్‌రావు

జహీరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: జహీరాబాద్ మున్సిపల్ కమీషనర్‌గా ఉమా మహేశ్వర్‌రావు మంగళవారం పదవీ బాధ్యులు చేపట్టారు. మున్సిపల్‌లో ఇంత వరకు కమీషన్‌గా బాధ్యతలు నిర్వహించి బదిలీపై వెళుతున్న శ్రీనివాస్‌రెడ్డి నుంచి ఉమామహేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు.ఖమ్మ జిల్లా మణుగూరు మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహించిన ఉమా మహేశ్వర్‌రావు జహీరాబాద్ మున్సిపాలిటీకి బదిలీ కావడంతో మంగళారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు కమీషనర్‌గా సేవలు అందించిన శ్రీనివాస్‌రెడ్డి మెదక్ మున్సిపల్ కమీషనర్‌గా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఉమా మహేశ్వర్‌రావుకు మున్సిపల్ సిబ్బంది, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, మాజీ కౌన్సిలర్ నామారవికిరణ్ తదితరులు శాలువాతో సత్కరించి ఘనంగా ఆహ్వానం పలికారు.



మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న అధికారి సుజాత

పామాయిల్ సాగుతో లాభాలు

చిన్నశంకరంపేట, అక్టోబరు 29,ప్రభాతవార్త: రైతులు పామాయిల్ సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని హార్టీ కల్చర్ అధికారి సూజాత తెలిపారు. మంగళవారం మండల పరిధి సూరారం గ్రామంలో భారతీయ ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ అధికారులు గ్రామస్తులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటలకు చీడపీడలు సోకే ఆస్కారం తక్కువన్నారు. ఆయిల్‌ఫామ్ సాగు చేసుకునే రైతులకు రాయితీ ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ రామక్రిష్ణారెడ్డి, రాజ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

జంగరాయిలో ధాన్యం కొనుగోలు చేయాలంటూ ఆందోళన చేస్తున్న రైతులు

చిన్నశంకరంపేట, అక్టోబరు 29, ప్రభాతవార్త: కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని తూకం వేయాలని మండల పరిధి జంగరాయి రైతులు ఆందోళన చేపట్టారు. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు పేరుకుపోయాయని, నాలుగురోజుల క్రితం ధాన్యం కొనుగోలుకేంద్రాలు ప్రారంభిస్తున్నామని చెప్పి నిర్వాహకులు ఫొటోలు దిగారని, ధాన్యాన్ని ఇప్పటివరకు తూకం వేయకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తూకం వేసేలా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరుతున్నారు.

నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన లక్ష్మీప్రసన్న



లక్ష్మీప్రసన్నను సన్మానిస్తున్న ఎంఇవో యాదగిరి, ఉపాధ్యాయులు

వెల్దుర్తి, అక్టోబరు 29 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివిన కోదండ లక్ష్మీప్రసన్న నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గాంధీ నేచురాపతి మెడికల్ కాలేజీలో ప్రభుత్వ సీటును సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం మండల విద్యాధికారి యాదగిరి, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, విద్యా కమిటీ చైర్మన్ కర్రె వెంకటేశంతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్నను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి నీట్‌లో ఉత్తీర్ణత సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావడం హర్షణీయమని అన్నారు.

విద్యార్థిని అభినందించిన మంత్రి

విద్యార్థిని అభినందిస్తున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : మండలంలోని బల్లునాయక్ తండాకు చెందిన లావుడ్యదేవి సిద్దిపేటజిల్లా మిట్టపల్లి సురభి మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించడంపట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పోతారం గ్రామంలో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి విద్యార్థినిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.నిరుపేద కుటుంబానికి చెందిన లావుడ్య లక్ష్మీ,రమేష్‌ల రెండవ కూతురు డాక్టర్ సీటు సాధించడం సంతోషంగా ఉందని వారు నిరుపేద కుటుంబానికి చెందిన వారని తన దృష్టికి వచ్చిందని ఆమె చదువుకు విషయంలో కావాల్సిన సహాయంతో పాటు వారికి అండగా ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రతీ ఇంట్లో జ్ఞానజ్యోతి వెలగాలి

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29,ప్రభాతవార్త : దీపావళి పర్వదినం రోజున ప్రతీ ఇంట్లో జ్ఞానజ్యోతి వెలగాలని త్రైత సిద్ధాంత ప్రభోదసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక హుజురాబాద్ కమిటీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం త్రైత సిద్ధాంత ప్రభోదసేవా సమితి,ఇందూ జ్ఞానవేదిక సభ్యులతో కలసి హుస్నాబాద్ మండలంలోని పందిల్లతో పాటు హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ దీపావళి ప్రతీ కుటుంబంలో శ్రీ స్వామి ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర భగవానుని ఆశీర్వాదంతో ఆనందోత్సవాల మద్య జరుపుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు భగవద్గీత గురించి తెలుసుకోవాలని ప్రచారం నిర్వహించారు.

ఎస్‌జిఎఫ్ క్రీడల్లో క్రీడాకారులు పోటీ పడుతున్న దృశ్యం

జిల్లా స్థాయి క్రీడల్లో మెదక్ హవేలి ఘనపూర్ విజయకేతనం

పాపన్నపేట, అక్టోబరు 29, ప్రభాతవార్త: మండల కేంద్రంలో మంగళవారం ప్రారంభమైన జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ కబడ్డీ క్రీడలోల మెదక్ హవేలి ఘనపూర్ మండలాలు మొదటి స్థానాల్ని దక్కించుకున్నాయి. క్రీడల్లో భాగంగా మొదటి రోజు బాలుర అండర్ 14, అండర్ 17విభాగాల్లో కబడ్డీ పోటీలు కొనసాగాయి. అండర్ 14 విభాగంలో హవేలి ఘనపూర్, అండర్ 14 విభాగంలో మెదక్ మండలం మొదటి స్థానాల్లో నిలిచాయి. రెండో స్థానంలో అల్లాదుర్గం మండలం నిలచింది. మొదటిరోజు మెదక్ జిల్లా 20 మండలాల పరిధిలోని క్రీడాకారులు పోటీలో తలపడ్డారు. రెండవ రోజు బుధవారం అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలికలకు కబడ్డీ పోటీలు ఉంటాయని పీడి రమేష్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకుగాను మైకులు, టెంట్లు స్థానిక నాయకులు నిలలక్షప్ప, గౌస్ సమకూర్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ జి రమేష్, జిల్లా పిఈటి సంం అధ్యక్షులు ఎస్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, పిడిలు రమేష్, ఎస్ చంద్రమోహన్, డి రవి మాధవ్‌రెడ్డి, మధుసూదన్, కిరణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, అశోక్, మహిపాల్, రాజేందర్, రూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

కొమురవెల్లి, అక్టోబరు 29, ప్రభాతవార్త : మండల కేంద్రానికి చెందిన ముత్యం భవానీకి ప్రభుత్వంనుంచి మంజూరైన రూ.11500 సిఎం సహాయ నిధి చెక్కును బిఆర్ఎస్ నాయకులు ఏర్పుల మహేష్ మంగళవారం అందజేశారు. సిఎంఆర్ఎఫ్ చెక్కును వెంటనే బ్యాంకు ఖాతాలో జమచేసుకోవాలన్నారు. సిఎం సహాయ నిధి చెక్కు మంజూరుకు సహకరించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపల్లి కిష్టయ్య, ముత్యం నర్సింహులుగౌడ్, కొండ శ్రీధర్, ముత్యం నాగరాజుగౌడ్, బైరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయం వద్ద పులిహోర పంపిణీ

గజ్వేల్ టౌన్, అక్టోబరు 29 (ప్రభాతవార్త): పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద ప్రతి మంగళవారం నిర్వహించే పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని బొజ్జ సంతోష్‌కుమార్, శాలిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నోముల మహేందర్, కైలాస ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం దాతల సహకారంతో పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దాత బొజ్జ సంతోష్‌కుమార్ దంపతులను శాలువాతో సన్మానించారు.

ఘనంగా ధన్వంతరి భగవాన్ జయంతి వేడుకలు

కొండపాక, అక్టోబరు 29, ప్రభాతవార్త: కుకునూరుపల్లి మండల నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలోకుకునూరుపల్లిలో తొలిసారి ధన్వంతరి భగవాన్ జయంతి వేడుకలను మండల అధ్యక్షుడు నేలపొగుల రాజకుమారి అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, అ సంఘం మండల ఉపాధ్యక్షుడు సంపత్, కోశాధికారి హరీష్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జునరెడ్డి



వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం విఫలమయిందని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు పండించిన ధాన్యాన్ని డ్రైడర్స్ తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్కెట్ కార్యదర్శికి వినతీ పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని,ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతీ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందుకూరి సతీష్, గోపగోని అరవింద్‌తో పాటు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 29, ప్రభాతవార్త : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సాదియా, అక్కన్నపేట మెడికల్ ఆఫీసర్ సుజాత అన్నారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో 9వ ఆయుర్వేద వినోత్సవం సందర్భంగా యోగా డే నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుర్వేదం ప్రాముఖ్యత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, చుటుపక్కలఉన్న మొక్కలలో ఉండే ఔషధ గుణాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజుతో పాటు ఫార్మాసిస్టు రాజమణి,పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గోతులు తీశారు..పనులు నిలిపేశారు

-అవస్థలు పడుతున్న భక్తులు, ప్రజలు

ఝరాసంగం, అక్టోబరు 29, ప్రభాతవార్త: అధికారుల అలసత్వంతో భక్తులు, ప్రజలు పాట్లు పడుతున్నారు. పనులు ప్రారంభించి ఆపేయడంతో ప్రజలు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. ఇదేదో మారు మూల గ్రామంలో అనుకుంటే పప్పులో కాలేసినట్లే. నిత్యం వేలాది మంది భక్తులు ఆయా ప్రాంతల నుంచి శ్రీ కేతకి సంగమేశ్వరుడి దర్శనానికి వచ్చే మండల కేంద్రమైన ఝరాసంగంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబ

Main-IV(MDK)-oct 29:Main-IV(MDK)-oct 29.qxd 10/29/2024 8:03 PM Page 1

చిన్నారిని ఆశీర్వదించిన నగేష్ శెట్కార్



డోలారోహణం కార్యక్రమంలో చిన్నారిని ఆశీర్వదిస్తున్న నగేష్ శెట్కార్

మనూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త: మండల పరిధిలోని రాణాపూర్ గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుభాష్‌రావు పాటిల్ మనవరాలి డోలారోహణ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళికాసంఘం మాజీ సభ్యులు నగేష్ కుమార్ శెట్కార్, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమానికి చేరుకున్న నగేష్ శెట్కార్, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలను సుభాష్‌రావు పాటిల్ సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిలు, నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, నాయకులు బ్రహ్మానందరెడ్డి, మునిగల వీరేశలింగం, రాజు, రామచందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, శివాజీ రావు, శివకాంత్ పాటిల్, కొంగల్‌రెడ్డి, చందు పాటిల్, విఠల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, బానాపూర్ రాజు, దినకర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన ద్విచక్ర వాహనం

బైకు అదుపుతప్పి గాయాలకు గురైన వ్యక్తి దృశ్యం

చౌట్కూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త: బైక్ అదుపుతప్పిన ఘటనలో వ్యక్తి తీవ్ర గాయాలకు గురైన సంఘటన మంగళవారం మండల కేంద్రమైన చౌట్కూర్ గ్రామ సమీపంలో సంగారెడ్డి-నాందేడ్, అకోలా జాతీయ రహదారి 161పై చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా కంది మండలం కలివేముల గ్రామానికి చెందిన నబి (50) సొంత పని నిమిత్తం ఎస్ ఇటిక్యాల గ్రామానికి వెళ్లి పనులు ముగించుకుని ద్విచక్ర వాహనం (ఎపి 13పి 9311)పై స్వగ్రామానికి వస్తున్న క్రమంలో చౌట్కూర్ గ్రామ శివారులో కొండయ్య కుంట వద్ద జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో నబి తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఎన్‌హెచ్ఎఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

విజయ్‌సింగ్ సేవలు మరువలేనివి

పదవీవిరమణ పొందిన విజయ్‌సింగ్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చౌట్కూర్, అక్టోబర్ 29, ప్రభాతవార్త: మండల పరిధిలోని శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టరుగా విధులను నిర్వహించి పదవీ విరమణ పొందిన విజయ్‌సింగ్ సేవలు మరువలేనివని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం అన్నారు. మంగళవారం పాఠశాలలో విజయ్‌సింగ్‌కు ఆత్మీయ వీడ్కోలు సభను నిర్వహించారు. విజయ్‌సింగ్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించి విజయ్‌సింగ్ చేసిన సేవలను కొనియాడారు. అంకిత భావంతో విధులు నిర్వహిస్తే ప్రజలు తమను కలకాలం గుండెల్లో పెట్టుకుని గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు, సిఆర్పీలు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేసిన చైర్మన్ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, అక్టోబర్ 29,ప్రభాతవార్త: అనారోగ్యానికి గురైన పట్టణంలోని గడి వీధికి చెందిన మొహమ్మద్ సాకిర్ మొహియుద్దీన్ కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందుకునేందుకు మంగళవారం సెట్విన్ కార్పోరేషన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి 1లక్ష రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల నామినేషన్‌లో ఎంపి

మహారాష్ట్ర ఎన్నికల నామినేషన్‌లో పాల్గొన్న ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్

నారాయణఖేడ్ టౌన్, అక్టోబరు 29, ప్రభాతవార్త: మహారాష్ట్ర శాసనసభ, నాందేడ్ పార్లమెంట్ ఉపఎన్నికలను పురస్కరించుకుని నాందేడ్ పార్లమెంట్ ఇంచార్జి, జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ మంగళవారం ఎన్నికల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్లమెంట్ పరిధిలోని ముఖేడ్ అసెంబ్లి కాంగ్రెస్ అభ్యర్థి హన్మంత్‌రావు పాటిల్, ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌తో కలసి నామినేషన్ దాఖలు చేశారు.

సుందరీకరణ పనులు పరిశీలించిన కార్పొరేటర్

రామచంద్రాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త: రామచంద్రాపురం డివిజన్ పరిధిలో శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ సమీపంలో ఉన్న బాలవిహార్ పార్క్‌లో 50లక్షల రూపాయలతో కొనసాగుతున్న సుందరీకరణ పనులను మంగళవారం కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పరిశీలించారు. పార్క్‌లో కొనసాగుతున్న పనులను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగ ఎఈ ప్రభు, స్థానికనాయకులతో కలిసి పరిశీలించారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ప్లే ఆపరేటర్స్, గేట్, పార్క్ కమాన్, వాల్ పేయింటింగ్, గజిబో, బటర్‌ఫ్లై లైటింగ్, చైర్స్, గాంధీవిగ్రహానికి సుందరీకరణ పనులు కొనసాగుతున్నట్లు కార్పోరేటర్ పేర్కొన్నారు. పనులు నాణ్యతాప్రమాణాలతో నిర్మించాలని అధికారులకు ఆదేశించారు. థీమ్ పార్క్ మాదిరిగా మరల్చుతామని కార్పోరేటర్ భరోసా కల్పించారు. కార్యక్రమంలో పీటర్, ఐలాపూర్ ఐలేష్, సీఎం మల్లేష్, మహేందర్‌రెడ్డి, ఎల్వర్తి మల్లేష్, రవి, భూషణం, మంగలి జగన్, బైకన్ నవీన్, చాకలి నర్సింహా, చంద్రకళ, అశ్విని, విజయలక్ష్మి, ఈర్ల మహేష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 29 ప్రభాతవార్త: విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణమండలి తిరస్కరించినందుకు రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు జరపాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మదేవేందర్ రెడ్డి ఆదేశానుసారం మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు నాయకులతో కలిసి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది నెలల కాలంలోనే 18,500 కోట్ల విద్యుత్ ఛార్జీల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేసిందని అన్నారు. ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని ప్రధాన ప్రతి పక్షంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం వ్యతిరేకించారని తెలిపారు. అదేవిధంగా పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్సీని ఒప్పించగలిగారని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షంగా తమవాదనలోని సహేతుకత, న్యాయాన్ని ఈఆర్సీ గుర్తించి విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను తిరస్కరించిందని అన్నారు. విద్యుత్ పెంపు ప్రతిపాదనలను తిరస్కరించినందుకు బిఆర్ఎస్ పార్టీ, రాష్ట్ర ప్రజలపక్షాన ఈఆర్సీ చైర్మన్ రంగారావు, సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ ఛార్జీలతో రూ. 18,500 కోట్ల అదనపుభారం ప్రజలపై మోపడాన్ని హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్లలలో నిర్వహించిన బహిరంగ విచారణలో బిఆర్ఎస్ వర్కింగ్ కెటిఆర్ తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. ఇది తెలంగాణ ప్రజల విజయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ కోకన్వీనర్ గడ్డమీది కృష్ణాగౌడ్, కండెల సాయిలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, భీమరి కిషోర్, సుంకయ్య, మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం, సోహెల్, నాయకులు జయరాం రెడ్డి, సాదిక్ అలీ, సంగ శ్రీకాంత్, అజ్గర్, రాజు, కిరణ్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ నటీనటులను ప్రోత్సహించాలి

పోస్టర్‌ను విడుదల చేస్తున్న బట్టు అంజిరెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 29 (ప్రభాతవార్త): గ్రామీణ ప్రాంతాలలో ఉన్న నటీనటులను ప్రోత్సహించాలని ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెప్యాల రాజేశ్వర్‌రావులు పేర్కొన్నారు. జగదేవ్‌పూర్ మండలం అలిరాజపేట గ్రామానికి చెందిన సినీ నటుడు అనిల్ మొగిలి మరియు ప్రముఖ ఫోక్ వీడియో డాన్సర్ జాను లిరి ఉమ్మడిగా నటించిన తాజా ప్రైవేట్ ఫోక్ ఆల్బమ్ పొరుషాల పిల్లగాడు ప్రోమో పోస్టర్‌ను మంగళవారం గజ్వేల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ఇతివృత్తంతో రూపొందించిన ఈ చిత్ర ఆడియో సాంగ్ అద్భుతంగా ఉందని స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే సింగర్ పాడిన ఇన్‌స్టాగ్రామ్ సంఖ్య 20లక్షలు దాటగా, అశేష ప్రేక్షకాదరణతో మంచి హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. పెద్ద హీరోలను కాకుండా గ్రామీణ ప్రాంత యువ హీరోలు రూపొందిస్తున్న గ్రామీణ ప్రాంత కథలు, వాతావరణంతో కూడిన చిత్రాలు అందించాలని పేర్కొన్నారు. అనిల్ మొగిలికి మంచి భవిష్యత్తు ఉందని, రానున్న రోజుల్లో సినిమా పరిశ్రమలో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు.

గడిపెద్దాపూర్‌లో ప్రభుత్వ భూమి కబ్జా

గడిపెద్దాపూర్లో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం

అల్లాదుర్గం, అక్టోబర్ 29, ప్రభాతవార్త: ప్రభుత్వ భూములు కానవస్తే కబ్జా చేసేందుకు అక్రమార్కులు సిద్ధంగా ఉంటూ కబ్జా చేసుకుంటున్నారు. కబ్జాకోరులు ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటున్నా సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో కబ్జాకోరులు అడిందే ఆటగా పాడిందే పాటగా కొనసాగుతోంది. మండల పరిధిలోన గడిపెద్దాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ భూమిని కబ్జాచేశారని, ప్రభుత్వభూమిని కాపాడాలంటూ గ్రామానికిచెందిన యువత తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. గ్రామ శివారులోని 863/1/1 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురయిందని యువత ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఖాళీ స్థలంలో యువత ఆటలాడుకుంటూ ఉండగా కొందరు రాజకీయ ముసుగులో స్థలాన్ని కబ్జా చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. కబ్జాకోరుల నుంచి ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించి యువత క్రీడలు ఆడుకునేందుకు ఉపయోగించేలా చూడాలని వినతి చేశారు. గ్రామ శివారులో కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి కబ్జా నుంచి భూమిని విడిపించాలని యువత డిమాండ్ చేస్తోంది.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

పావన్నపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని, విధి నిర్వాహణలో చేసిన సేవలు కలకాలం గుర్తింపునిస్తాయని జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధాకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొడుపాక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా సేవలు అందించి పదవీ విరమణ పొందిన రంగారెడ్డికి ప్రధానోపాధ్యాయులు ఆరోగ్యం అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలుసభను నిర్వహించారు. కార్యక్రమానికి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై రంగారెడ్డి చేసిన సేవలను కొనియాడి రంగారెడ్డిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. 17 బ్యాచ్‌ల విద్యార్థులు రంగారెడ్డి సేవలను అందుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, నీలకంఠం, ఎఎస్ఓఎం నవేంకుమార్, జిల్లా పిఆర్‌టియు అధ్యక్షులు సుంకరి కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు రాములు, భీమన్న, ప్రవీణ్, కాశీనాథ్, మింగర్తి రాములు, వెంకటరామణ, వెంకట్‌రెడ్డి, రమేష్, చంద్ర శేఖర్, శంకర్‌రెడ్డి, నవీన్, ప్రసాద్, సాయిలు, కొండల్‌రెడ్డి, ఆయా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

మర్కుక్, అక్టోబర్ 29 (ప్రభాతవార్త): దీపావళి పండుగ సందర్భంగా మండలంలో అనుమతులు లేకుండా టపాసుల దుకాణాలు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దామోదర్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రం మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టపాసుల దుకాణాలు పెట్టాలనుకునేవారు తప్పనిసరిగా సంబంధిత శాఖల నుండి అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్సీ

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 29 (ప్రభాతవార్త): గజ్వేల్ మండలంలోని అక్కారం, శ్రీగిరిపల్లి, గిరిపల్లి, బంగ్లావెంకటాపూర్ గ్రామాల్లో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఐకెపి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఐకెపి కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచిన తర్వాత కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఏఎంసి డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, ఏపిఎం దుర్గాప్రసాద్, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, సిసిలు శ్రీనివాస్, నాగరాజు, కుమార్, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గమ్మను దర్శించుకున్న అదనపు కలెక్టర్

వనదుర్గా భవాని మాతను దర్శించుకుంటున్న అదనపు కలెక్టర్ నగేష్ గౌడ్

పాపన్నపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త: ఏడుపాయల వనదుర్గా భవాని మాతను మంగళవారం అదనపు కలెక్టర్ నగేష్ గౌడ్ (బదిలీపై వచ్చిన సందర్భంగా) దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న నగేష్‌గౌడ్‌ను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా నగేష్ గౌడ్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డిలు శాలువాలతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందచేశారు.

నర్సాపూర్‌లో ప్రభుత్వ అధికారుల బదిలీలు

నర్సాపూర్ అక్టోబర్ 29. ప్రభాతవార్త: నర్సాపూర్‌లో పలువురు ప్రభుత్వ అదికారులు బదిలీ అయ్యారు. ఈమేరకు నర్సాపూర్ ఆర్డీవోగా విధులు నిర్వహించిన జగదీశ్వర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కందుకూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సికింద్రాబాద్ ఆర్డీవోగా పని చేస్తున్న మహిపాల్‌ను నియమించడం జరిగింది. ఈమేరకు నర్సాపూర్ ఆర్డీవోగా మహిపాల్ బాధ్యతలు స్వీకరించారు. అదేవిదంగా నర్సాపూర్ విధ్యుత్ శాఖలో పని చేస్తున్న ఏడిఈ బాపర్కర్‌రెడ్డి హైద్రాబాద్‌కు పదోన్నతి పై వెళ్ళగా ఆయన స్థానంలో రమణారెడ్డి షామీర్‌పేట నుండి బదిలీపై రాగా నర్సాపూర్ విద్యుత్ శాఖ ఏడిఈ గా బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇదే విద్యుత్ శాఖలో ఏఈ గా పనిచేసిన రాజ్‌కుమార్ హైద్రాబాద్ కుషాయిగుడాకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో హైద్రాబాద్ నుండి బదిలీపై వచ్చిన రామ్మూర్తి విద్యుత్ శాఖ ఏఈ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ విధంగా నర్సాపూర్‌లో పలు ప్రభుత్వ శాఖల్లో పని చేసిన అధికారులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో బదిలీపై వచ్చిన అధికారులు బాధ్యతలు స్వీకరించారు.

గంగోజిపేటలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

గంగోజిపేటలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు నత్త దశరథ్

చౌట్కూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త: రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్త దశరథ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గంగోజిపేటలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నత్తి దశరథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నత్త దశరథ్ మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు అందిస్తూ వరి ధాన్యమును కొనుగోలు చేస్తుందని, అందుకు రైతులు తాము పండించిన వరి ధాన్యమును కొనుగోలు కేంద్రంలో విక్రయించుకుని లబ్దిపొందాలని సూచించారు. ఏ గ్రేడ్ వరి ధాన్యం క్వింటాలుకు 2320, సాధారణ రకానికి 2300 చెల్లించడం జరుగుతుందని, సన్న ధాన్యానికి అదనంగా 500 రూపాయల బోనస్ అందిస్తామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి ఆగం కావద్దని సూచించారు. డిసిఎంఎస్, పిఎసిఎస్, ఐకెపిల ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ గొల్ల రాములు, మాజీ సర్పంచ్ గౌండ్ల బాలాగౌడ్, నాయకులు డీలర్ ప్రసాద్, జావీద్, రైతులు పాల్గొన్నారు.

కాశిరెడ్డిపల్లి యువకునికి డాక్టరేట్

మర్కుక్, అక్టోబర్ 29 (ప్రభాతవార్త): జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో తెలంగాణ ఉద్యమం సమయంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి నాయకుడు మర్కుక్ మండల పరిధిలోని కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అప్పాల శ్రీకాంత్‌కు ఎన్వరాన్మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పరిశోధనలకు గాను యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ 2012లో పిహెచ్‌డిలో చేరి తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని పట్టుదల, కృషితో తన విద్యను పూర్తి చేసినట్లు తెలిపారు. డాక్టరేట్ తన చిన్నప్పటి కళ అని, తనకు డాక్టరేట్ రావడం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

గజ్వేల్, అక్టోబర్ 29 (ప్రభాతవార్త): మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలు గత ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూసేకరణ సమయంలో నిర్వాసితులు వారి సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటం దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా గొప్ప పోరాటంగా గుర్తింపు వచ్చిందన్నారు. పోరాటాల ఫలితంగానే నిర్వాసితులు కొన్ని హక్కులు సాధించుకున్నప్పటికీ ఇప్పటికి నిర్వాసితులకు అప్పటి ప్రభుత్వం చెప్పిన హామీలను నెరవేర్చలేకపోయిందన్నారు. నిర్వాసితులకు ఇండ్లు, ఫ్లాట్లు రాక ఎప్పుడు వస్తాయో అని ఎదురు చూస్తూ మనోవేదనకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, నాయకుడు బండ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పర్యటించనున్న బిసికమిషన్ ప్రతినిధి బృందం

సంగారెడ్డిబ్యూరో అక్టోబర్ 29 ,ప్రభాతవార్త: తెలంగాణ బిసి కమీషన్ ప్రతినిధుల బృందం ఈనెల 30న బుధవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించనుంది. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై, ఉమ్మడిజిల్లాకు సంబంధించిన అయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజలు అభిప్రాయాలను బిసి కమీషన్ సభ్యులకు వివరించవచ్చు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుండి వచ్చే వినతులను స్వీకరిస్తారు. ప్రజాభిప్రాయసేకరణకు అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసింది.

పారిశుద్ధ్య కార్మికులకు అధునాతన పరికరాలు

పారిశుద్ధ్య కార్మికులకు అధునాతన పరికరాలు అందచేస్తున్న దృశ్యం

పాపన్నపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త: పంచాయితీ కార్మికులు అలసటకు గురికాకుండా తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే అధునాతన పరికరాలను అందుబాటులో ఉంచామని డిఎల్‌పిఓ, మండల ప్రత్యేక అధికారి సురేషిబాబు అన్నారు. మంగళవార మండల కేంద్రమైన పాపన్నపేట గ్రామ పంచాయితీ కార్మికులకు అధునాతన పరికాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ దోమల నివారణకు ఫోర్ టేబుల్ ఫాగింగ్ మిషన్‌ను కొనుగోలు చేశామన్నారు. గ్రామంలోని చిన్న చిన్న వీధులలో సైతం ఫాగింగ్ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. గడ్డి కోత, చెత్తను తొలగించే యంత్రాలు, చెత్తను సేకరించే మిషన్ సిద్ధంగా ఉన్నాయన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు అధునాతన యంత్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి నహీ, సిబ్బంది కిట్లు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సభ్యులకు ఎడ్యుకేషన్‌పై అవగాహన

ఝరాసంగంలో సొసైటీ సభ్యులకు ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఝరాసంగం, అక్టోబర్ 29, ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఝరాసంగంలోని సొసైటీ సంఘం సభ్యులకు మంగళవారం ఎడ్యుకేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. జాయింట్ రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ తుమ్మ ప్రసాద్ మాట్లాడుతూ సంఘసభ్యులకు సంఘసేవలను, స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు, (గేదెలు, ఆవులు, డైరీ, కోడ్ల ఫాం, మేకలు గొర్రెలు, ఎరువులు), విత్తనాలు, రైతులు పండించిన ధాన్యాలను ప్రభుత్వ మద్దతుధరతో కొనుగోలుచేయడం తదితర సేవలపై అవగాహన కల్పించారు. సంఘ అభివృద్ధికి సభ్యులకు సేవలు అందించుటకు పరస్పరం సహకరించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూంసింగ్, శ్రీనివాస్, యండి గౌసోద్దిన్, సంఘం కార్యదర్శి నిసార్ ఆహ్మద్, మారుతీరావు పాటిల్, బిచ్చగొండ, సంగన్న, క్రిష